www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 27 అక్టోబర్ 2025

5

కాకినాడ



బుద్ధా శ్రీనివాస్‌కు నేషనల్ ఎక్సలెన్స్ అవార్డు

ప్రజాశక్తి - పెద్దాపురం

సైన్స్ ఉపాధ్యాయుడు బుద్ధా శ్రీనివాస్‌కు నేషనల్ ఎక్సలెన్స్ అవార్డు వరించింది. విద్యార్థులకు ఉచితంగా సైన్స్ ప్రయోగాలతో పాఠాలు బోధిస్తున్న స్థానిక సైన్స్ సెంటర్ నిర్వాహకుడు బుద్ధా శ్రీనివాస్ ఆదివారం జాతీయ స్థాయి ప్రగతి ఆచార్య అవార్డును కేంద్ర మినిస్ట్రీ ఆఫ్ నేషనల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ఆయన అవార్డును అందుకున్నారు. అవార్డు అందుకున్న బుద్ధా శ్రీనివాస్‌ను డిఇఒ పిల్లి రమేష్, అల్లంరాజు చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ రాంశాస్త్రి, పెద్దాపురం మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబురాజు అభినందించారు.



అవార్డు అందుకుంటున్న బుద్ధ శ్రీనివాస్

ముంచుకొస్తున్న మొంథా

- కాకినాడ-తుని మధ్య తీరం దాటే అవకాశం
- మూడు రోజులు రెడ్ అలర్ట్
- కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు
- 31 వరకూ విద్యా సంస్థలకు సెలవు

ప్రజాశక్తి - యంత్రాంగం

అన్నదాతల గుండెల్లో మొంథా తుపాను హెచ్చరికలు గుబులు రేపుతున్నాయి. పంట చేతికందే సమయంలో ఏటా తుపానులు దాడి చేస్తున్నాయి. ఈ ఏడాదీ ఆ కలవరం తప్పడం లేదు. ఇప్పటికే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వరి కోతలు ప్రారంభం అయ్యాయి. తుపాను ప్రభావంతో రేపటి నుంచి రాష్ట్రంలో భారీ నుంచి అతిభారీ వర్షాలతో పాటు ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అధికారులను అప్రమత్తం చేసింది. పంట చేతికి అందే సమయంలో ఈదురుగాలులు వీస్తే భారీగా నష్టం జరిగే అవకాశం ఉంది. రూ.వేలల్లో పెట్టుబడి పెట్టి.. ఆరుగాలం శ్రమించే అన్నదాతలు నోటి వద్దకు కూడు వచ్చే సమయంలో తుపాను హెచ్చరికలతో నిద్రకు దూరమవుతున్నారు. మొంథా ప్రభావంతో భారీగా వర్షాలు పడే అవకాశం ఉండటంతో ఇప్పటికే కోసిన ధాన్యాన్ని భద్రపరుచుకోవాలని అధికారులు రైతులకు సూచిస్తున్నారు. వర్షాలకు ధాన్యం తడిసిపోకుండా కాపాడుకునేందుకు తహసీల్దార్ కార్యాలయాల్లో టార్పాలిన్లు ఉచితంగా అందించేందుకు సిద్ధంగా ఉంచాలని కోరుతున్నారు. తుపానుపై రైతులను అప్రమత్తం చేయాలని రెవెన్యూ, వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులకు ప్రభుత్వం సూచించింది. తీర ప్రాంతాల్లోనూ ప్రజలను అప్రమత్తం చేయనున్నారు. తుపానుకు ఎటువంటి ప్రాణ, ఆస్తినష్టం సంభవించకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా అధికారులకు సిఎం చంద్రబాబు దిశా నిర్దేశం చేశారు. కాకినాడ పోర్టు-తుని మధ్య మంగళవారం అర్ధరాత్రి తీరం దాటే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు సోమ, మంగళ, బుధవారం మూడు రోజులపాటు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించింది. అత్యవసరమైతే తప్పించి ప్రజలు ప్రయాణాలు మానుకోవాలని హెచ్చరించింది. తుపాను కాకినాడ పోర్టు-తుని సమీపంలో తీరం దాటే అవకాశం ఉందని అంచనా వేస్తుండడంతో కాకినాడ యాంకరేజ్, డీప్ వాటర్ పోర్టులు అప్రమత్తమయ్యాయి. సోమవారం నుంచి మూడు రోజులు అన్ని కార్గో ఎగుమతి, దిగుమతులు నిలిపివేయాలని నిర్ణయించారు. ప్రస్తుతం డీప్‌వాటర్ పోర్టులో 19, యాంకరేజ్ పోర్టులో ఆరు నౌకలు కార్గో కోసం లంగరు వేశాయి. వీటిని సోమవారం మధ్యాహ్నం తీరం నుంచి 150 నాటికల్ మైళ్ల దూరానికి తరలించనున్నారు. పోర్టులో సోమవారం నుంచి ఐదో నెంబరు ప్రమాద హెచ్చరిక ఎగురవేయనున్నారు. మరోవైపు కాకినాడ, అంబేద్కర్ కోనసీమ, తూర్పు గోదావరి జిల్లాల్లో కలెక్టరేట్లు, ఆర్‌డిఒ కార్యాలయాలు, జలవనరుల శాఖ, ట్రాన్స్‌కో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశాయి. కాకినాడ జిల్లాలో 27వ తేదీ నుంచి 31వ తేదీ వరకూ ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థలకు సెలవులను కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి ప్రకటించారు. ఏలేరు రిజర్వా యర్‌లో ముందుగానే నీటిని విడుదల చేయడంతో పరీవాహక ప్రాంతాలను అప్రమత్తం చేశారు. తుపాను తీరం దాటే సమయంలో కాకినాడ జిల్లాపై తీవ్ర ప్రభావం పడనుంది. భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉందన్న హెచ్చరికలతో గ్రామ స్థాయిలో సిబ్బం ది అంతా క్షేత్రస్థా యిలో అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. కాకినాడ, కోనసీమ జిల్లాల్లో లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతా లకు తరలించడానికి కార్యాచరణ రూపొందించారు. తుపాను పునరా వాస కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. నిత్యావసరాలను తగిన ప్రదేశాల్లో ఉంచేలా పౌరసరఫరాల శాఖ ఏర్పాట్లు చేస్తోంది.



ప్రత్యేక బోట్లలో ఒడ్డుకు చేరుకుంటున్న హోప్ ఐలాండ్ ప్రాంత ప్రజలు

తుపాన్‌ను ఎదుర్కొనేందుకు సన్నద్ధం

మొంథా తుపాన్‌ను ఎదుర్కొనేందుకు అధికారులు సన్నద్ధంగా ఉండాలని కలెక్టర్ షాన్ మోహన్ సగిలి, జిల్లా ప్రత్యేక అధికారి మైలవరపు కృష్ణతేజ అధికారులను ఆదేశించారు. తుపాన్‌ను ఎదుర్కొనేందుకు కావాల్సిన ముందస్తు ఏర్పాట్లపై ఎస్‌పి బిందుమాధవ్‌తో కలిసి ఆదివారం కలెక్టరేట్ నుంచి మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తుపాన్ ప్రభావం తీర ప్రాంత మండలాలపై ఎక్కువగా ఉండే అవకాశం ఉందన్నారు. జిల్లాలో ప్రధానంగా తొండంగి, ఉప్పాడ, తాళ్లరేవు, కాకినాడ రూరల్, కాకినాడ పట్టణ ప్రాంతాధికారులు మరింత అప్రమత్తతో వ్యవహరించాలన్నారు. ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు జిల్లాలో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్‌లు, తహశీల్దారులు, ఎస్‌హెచ్‌ఒలు, సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు.

ఉప్పాడ - కాకినాడ బీచ్ రోడ్డు బంద్

తుపాన్ ప్రభావంతో ఉప్పాడ-కాకినాడ బీచ్ రోడ్డును రెండు రోజులపాటు బంద్ చేసినట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. బీచ్ రోడ్డులో సముద్ర అలల తీవ్రత ఎక్కువగా ఉంటాయని ముందస్తు చర్యల్లో భాగంగా బీచ్ రోడ్డులో రకపోకలను నిషేధించినట్లు తెలిపారు. కాకినాడ వెళ్లేవారు పిఠాపురం మీదుగా వెళ్లాలని, నేమం, ఉప్పాడ రింగ్ రోడ్డు వద్ద వాహనాలు వెళ్లకుండా భారీ కేడ్లను ఏర్పాటు చేయడం జరిగిందని, వాహనదారులు సహకరించాలని కోరారు.

బయటకు చేరుకున్న హోప్ హైలాండ్ ప్రజలు

మొంథా తుపాన్ తీవ్రత నేపథ్యంలో కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి ఆదేశాలతో అధికారులు హోప్ హైలాండ్‌లో ఉన్న ప్రజలను ఆదివారం సురక్షిత ప్రాంతానికి చేరుకున్నారు. ఆరు ప్రత్యేక బోట్లలో సుమారు 110 మందిని కాకినాడ రూరల్ మండలం తూరంగి గ్రామంలో హోప్ ఐలాండ్ కాలనీకి సురక్షితముగా తరలించినట్లు ఆర్‌డిఒ మల్లిబాబు తెలిపారు.



ఉప్పాడ- కాకినాడ బీచ్ రోడ్డులో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు



ఎన్నికైన సిఐటియు నూతన కార్యవర్గం

పని గంటల పెంపును వ్యతిరేకించండి

-సిఐటియు జిల్లా మహాసభలో 22 తీర్మానాలు ఆమోదం

ప్రజాశక్తి - పెద్దాపురం

రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పని గంటల పెంపుకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని తీవ్రతరం చేయాలని సిఐటియు జిల్లా మహాసభ తీర్మానించింది. అలాగే పరిశ్రమల్లో ప్రమాదాలను అరికట్టే చర్యలను చేపట్టాలని డిమాండ్ చేసింది. స్థానిక యాసలపు సూర్యారావు భవన్‌లో సిఐటియు 12వ జిల్లా మహాసభ రెండో రోజు ఆదివారం కొనసాగింది. ఈ సందర్భంగా 22 తీర్మానాలను మహాసభ ఆమోదించింది. పని గంటల పెంపును వ్యతిరేకిస్తూ తీర్మానాన్ని సిఐటియు జిల్లా కార్యదర్శి దారపురెడ్డి క్రాంతికుమార్ ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమల్లో తరచూ ప్రమాదాలు జరుగుతూ పదుల సంఖ్యలో కార్మికులు మృతి చెందుతున్న ఘటనలు ఎక్కువయ్యాయని అన్నారు. ఎక్కడైతే కార్మికులు పోరాడుతున్నారో అక్కడ మాత్రమే బాధితులకు పరిహారం చెల్లింపు జరుగుతోందని, కార్మిక సంఘాల దృష్టికి రాని అనేక ప్రమాదాలలో బాధితులకు చట్ట ప్రకారం కనీస పరిహారం కూడా అందటం లేదని అన్నారు. పరిశ్రమల్లో నాణ్యతలేని మిషనరీలు, పరికరాలు ఉపయోగించడంతో లాభాలు పెంచు కోవాలనే యాజమాన్యాల చూస్తున్నాయని, తక్షణం అన్ని పరిశ్రమలలో సేఫ్టీ తనిఖీలు చేయాలని మహాసభ ముందు తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ తీర్మానాన్ని మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. అలాగే కార్మికులను బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, షెడ్యూల్డ్ పరిశ్రమల్లో కనీస వేతనాల సవరణను వెంటనే చేపట్టాలని, కనీస వేతనం 26 వేల ఇవ్వాలని తీర్మాణించారు. ప్రభుత్వ శాఖల్లో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను సీనియారిటీ ప్రాతిపదికన పర్మనెంట్ చేయాలని, అంగన్‌వాడీ, ఆశ తదితర స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి రెగ్యులర్ చేయాలని తీర్మాణించారు. కాకినాడ జిజిహెచ్, కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలో వివిధ విభాగాలలో థర్డ్ పార్టీ కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దుచేసి కార్మికులకు ప్రభుత్వమే నేరుగా జీతాలు చెల్లించాలని తీర్మానించింది. మహిళలు పనిచేస్తున్న అన్ని శాఖల్లో మహిళ లైంగిక వేధింపుల నిరోధక కమిటీలు ఏర్పాటు చేయాలని, పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలను అదుపులో ఉంచాలని, ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయాలని తీర్మాణించారు.



అధ్యక్షుడు శేషబాబ్జి



కార్యదర్శి రాజ్‌కుమార్

నూతన కార్యవర్గం ఎన్నిక

సిఐటియు జిల్లా నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. సిఐటియు జిల్లా అధ్యక్షులుగా దువ్వా శేషబాబ్జి, ప్రధాన కార్యదర్శిగా చెక్కల రాజ్‌కుమార్, కోశాధికారిగా మలక వెంకటరమణ ఎన్నికయ్యారు. స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో రెండు రోజులపాటు జరిగిన సిఐటియు 12వ జిల్లా మహాసభ ఉత్సాహ వాతావరణంలో ముగిసింది. 11 మంది ఆఫీస్ బ్యారర్లుగా, జిల్లా కమిటీ సభ్యులుగా 27 మంది మొత్తం 38 మందితో నూతన కమిటీ ఎన్నికయింది. జిల్లా ఉపాధ్యక్షులుగా జి.బేబీరాణి, కె.సత్తిరాజు, చంద్రావతి, జిల్లా కార్యదర్శులుగా దారపురెడ్డి క్రాంతికుమార్, చంద్రమళ పద్మ, రొంగల ఈశ్వరరావు ఎన్నికయారు. జిల్లా కమిటీ సభ్యులుగా పలివెల వీరబాబు, షేక్ పద్మ, నకెళ్ళ శ్రీను, బాబురావు, నొక్కు లలిత, రత్నం దుర్గ తదితరులు ఎన్నికయ్యారు. నూతన కమిటీ ఎన్నికను సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు పర్యవేక్షించారు.

ఘనంగా 'చిగురించే పేజీలు' ఆవిష్కరణ సభ

ప్రజాశక్తి - కాకినాడ

సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో ఆదివారం సుబ్బయ్య రెసిడెన్సీ సమావేశ మందిరంలో దొండపాటి నాగజ్యోతి శేఖర్ రచించిన 'చిగురించే పేజీలు' కవితా సంపుటి ఆవిష్కరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో సాహిత్యవేత్తలు, కవులు, పాఠకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి జ్యోస్యుల కృష్ణబాబు అధ్యక్షత వహించగా, ప్రధాన వక్తగా సంపుటి ఆవిష్కర్తగా బెల్లంకొండ ప్రసేన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రసేన్ మాట్లాడుతూ 'నాగజ్యోతి కవిత్వం స్త్రీ అనుభూతి, కుటుంబ జీవితం, ఉపాధ్యాయ అనుభవం, మానవ సంబంధాల మాధుర్యాన్ని మిళితం చేస్తుంది. ప్రతి కవితలోనూ ఒక అంతరంగపు గీతం వినిపిస్తుంది. 'చిగురించే పేజీలు' జీవితం యొక్క ప్రతి పుటను ప్రేమతో, బాధతో, ఆశతో అల్లిన ఒక స్మృతి పుస్తకం" అన్నారు. నాగజ్యోతి కవిత్వంలోని ఆత్మస్పర్శను గదుల నాగేశ్వరరావు, కట్టా కృష్ణారావు, పద్మజావాణి ప్రస్తావించారు. అద్దేపల్లి ప్రభు, బొల్లోజు బాబా సంపుటిపై సమగ్ర సమీక్ష చేశారు. నాగజ్యోతి ఆత్మీయులు, బంధువులు, సహోద్యోగులు మాట్లాడారు. సాహితీ స్రవంతి నగర కమిటీ తరపున నిర్వాహకులు అందరికి ధన్యవాదాలు తెలిపారు.



చిగురించే పేజీల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

అంకితభావంతో విధులు నిర్వర్తించాలి

ప్రజాశక్తి - కాకినాడ

నూతనంగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేయాలని యుటిఎఫ్ నేతలు సూచించారు. ఆదివారం స్థానిక యుటిఎఫ్ హోంలో నూతనంగా ఉపాధ్యాయ వృత్తిలోకి ప్రవేశించిన ఉపాధ్యాయులకు సర్వీస్, లీవ్ రూల్స్‌పై జిల్లా స్థాయి అవగాహనా సదస్సు యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు సిహెచ్.సూరిబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు ఉన్న సెలవు నిబంధనలు, సర్వీస్ కండిషన్స్‌పై సీతారామారావు వివరించారు. యూటిఎఫ్ సీనియర్ నాయకుడు ఐ.ప్రసాదరావు 'యూటిఎఫ్ విశిష్టత - ఆశయాలు'పై బోధించారు. యూటిఎఫ్ సిద్ధాంతం అవినీతికి వ్యతిరేకంగా పోరాడం అని, సమస్యలు పరిష్కారానికి పోరాటాలే మార్గం అనే నమ్మి గత యాభై సంవత్సరాలుగా అనేక సమస్యలు పరిష్కారం చేసిందన్నారు. ఉపాధ్యాయుల సంక్షేమమే పరమావధిగా పని చేస్తుందని తెలిపారు. అప్పారి వెంకటస్వామి, డి.రామిరెడ్డి, మైనేని వెంకటరత్నం వంటి నాయకులు ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారానికి కృషి చేశారని, ఉద్యమం కోసం తమ జీవితాలను, జీతాలను త్యాగం చేశారని గుర్తు చేశారు. అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహ ఆశయాలతో ముందుకు సాగుతోందని వివరించారు. కొత్తగా జాయిన్ అయిన ఉపాధ్యాయులు యుటిఎఫ్ సభ్యత్వం తీసుకోవడం పట్ల యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు అభినందనలు తెలిపారు. రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ నూతన ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేయాలని కోరారు. ఈ సదస్సులో సీనియర్ నాయకులు ప్రభాకరవర్మ, జిల్లా కార్యదర్శులు పెద్దిరాజు, సీతారామరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ నేత ప్రసాదరావు

ఉచిత వైద్య శిబిరాలతో సత్వర వైద్యం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఉచిత వైద్య శిబిరాల ద్వారా పేదలకు సత్వర వైద్యం అందుతుందని ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ మాధురిదేవి అన్నారు. ఆదివారం స్థానిక సాయి శంకర్ నేత్రాలయ ఆవరణలో లయన్స్ క్లబ్, కాకినాడ సూర్య కంటి ఆసుపత్రి, ఎఎల్ఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ శిబిరంలో సుమారు 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. ఆపరేషన్ అవసరమైన 38 మందిని కాకినాడ తరలించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ అనసూరి నాగేశ్వరరావు, సూర్య హాస్పిటల్ ఫౌండర్ డాక్టర్ రాంప్రకాష్, వైద్యులు రామసేష సుబ్రహ్మణ్యం, డాక్టర్ శివ, లయన్స్ సభ్యులు జ్యోతుల నాగసత్య శ్రీనివాస్, అలమండ దుర్గాప్రసాద్, ఊర రాజబాబు, గొల్లపూడి గణేష్, టి రాము పాల్గొన్నారు.



వైద్య సేవలందిస్తున్న వైద్య సిబ్బంది

వైద్య శిబిరాన్ని పరిశీలించిన చినరాజప్ప

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక భీమేశ్వర ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అత్యవసర వైద్య శిబిరాన్ని ఆదివారం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప పరిశీలించారు. ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చే యాత్రికులకు అవసరమైన వైద్య సేవలు అందించాలని సిబ్బందికి ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఒ బల్ల నీలకంఠం, ఆలయ ట్రస్ట్ బోర్డ్ ఛైర్మన్ కంటే జగదీష్‌మోహన్, రాష్ట్ర గౌడ్ కార్పొరేషన్ డైరెక్టర్ బడుగు శ్రీకాంత్, టిడిపి నాయకులు అడబాల కుమారస్వామి, వల్లూరి దొరబాబు, ట్రస్ట్ బోర్డ్ సభ్యులు గొల్తి సత్యనారాయణ, తాతపూడి అరుణ్‌వంశీ పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న చినరాజప్ప

వైద్య విద్య ప్రయివేటీకరణపై నిరసన

ప్రజాశక్తి - ఏలేశ్వరం, గొల్లప్రోలు

మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక బాలాజీ సెంటర్లో జరిగిన నిరసన కార్యక్రమంలో వైసిపి యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి బదిరెడ్డి గోవింద్‌బాబు, పట్టణ అధ్యక్షుడు శిడగం వెంకటేశ్వరరావు మాట్లాడారు. మెడికల్ కాలేజీలను ప్రయివేటీకరించడం ద్వారా పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేయడమేనని అన్నారు. తక్షణమే ప్రభుత్వం పిపిపి విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సుంకర రాంబాబు, సామంతుల సూర్యకుమార్, జువ్విన వీర్రాజు, వాగు బలరాం, అలమండ నాగేంద్ర, లోగిసు శేఖర్, కత్తి రాజా, గొడుగు నాగేంద్ర, రాచర్ల రమేష్ పాల్గొన్నారు. అలాగే గొల్లప్రోలులోని రామవరం రోడ్డులోని వైఎస్ఆర్ విగ్రహం వద్ద వైసిపి ఆధ్వర్యంలో మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మైనం రాజా, నాయకులు మొగిలి అయ్యారావు, తెడ్లపు నాగేంద్ర, అంజూరి రాంబాబు, దాసం పూసలు, ఈరుగుల రమేష్ పాల్గొన్నారు.

బౌద్ధ ధమ్మ మహాసభ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - తాళ్లరేవు

తూర్పు గోదావరి జిల్లా కోరుకొండ మండలం కాపవరంలో నవంబర్ 8వ తేదీన జరిగే బౌద్ధ ధమ్మ మహాసభను జయప్రదం చేయాలని బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా మండల అధ్యక్షులు పినిపే నాగేంద్ర, త్రిరత్న బౌద్ధ సంఘం అధ్యక్ష కార్యదర్శులు జక్కల ప్రసాద్‌బాబు, గుత్తాల సుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక అంబేద్కర్ భవనంలో ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పురాతన బౌద్ధ క్షేత్రాల సంరక్షణ కోసం బుద్ధిష్ట్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్, జన చైతన్య మండలి, తథాగత బుద్ధ విహార ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి అంబేద్కర్ ముని మనవడు, బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షులు రాజారత్న అశోక్ అంబేద్కర్ హాజరవుతున్నారని అన్నారు. ఈ సందర్భంగా 130 మీటర్ల పంచశీల పతాక ర్యాలీ జరుగుతుందని తెలిపారు. కావున ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి బౌద్ధులు, అంబేద్కరీయులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్‌పి మాజీ ఛైర్మన్ దున్నా జనార్ధనరావు, ఎండియుబ్ల్యూఎ అధ్యక్ష, కార్యదర్శులు కన్నీడి వెంకటరమణ, కుసుమ శ్రీనివాస్, నాయకులు కమిడి ఈశ్వరీబాయి, వెంటపల్లి నూకరాజు, దడాల జగదీష్, దడాల బుజ్జి బాబు, రొక్కం లోవ రాజు, కూరాటి రామారావు, విప్పర్తి శ్రీనివాస్, గోడి భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

తుపాను పట్ల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

మొంథా తుపాన్ నేపథ్యంలో ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆర్‌డిఒ ఎస్.మల్లిబాబు సూచించారు. ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మత్స్యకార నాయకులు, అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్‌డిఒ ఎస్.మల్లిబాబు పాల్గొని మాట్లాడారు. తుపాన్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మత్స్యకారులెవ్వరూ వేటకు వెళ్లకుండా మత్స్యకార సంఘ నాయకులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో తహశీల్దార్ జి. చిన్నారావు, ఎంపిడిఒ లక్ష్మీరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమ ర్యాలీ వాయిదా

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

మొంథా తుపాన్ నేపథ్యంలో ఈ నెల 28న ప్రత్తిపాడులో జరగాల్సిన ప్రజా ఉద్యమ ర్యాలీని వాయిదా వేసినట్లు వైసిపి నియోజకవర్గ కో-ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు తెలిపారు. అనారోగ్యానికి గురియైన ఆర్‌ఎంపి వైద్యులు డాక్టర్ అంది చిట్టికొండను ఆదివారం ఆయన పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ వైద్య విద్య ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 28న తలపెట్టిన ప్రజా ఉద్యమ ర్యాలీని తుపాన్ కారణంగా వాయిదా వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ రామిశెట్టి నాని, కిలాడీ బాజ్జీ, పాలిక విజయబాబు పాల్గొన్నారు.

సాయి అభ్యుదయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సన్మానం

ప్రజాశక్తి - రౌతులపూడి


మండలంలోని పారూపక గ్రామంలో సాయి అభ్యుదయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాఠశాల ఉపాధ్యాయులు, మండల ఉప విద్యాశాఖాధికారి గాడి కొండబాబులను ఘనంగా సత్కరించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు వి.గిరీష్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ పకుర్తి లక్ష్మి, ఎంపిటిసి సభ్యులు వెంకటలక్ష్మి, టిడిపి నాయకులు కోసూరి వర్మ, తిరుమాల వేంకన్నదొర పాల్గొన్నారు.

నేటి పిజిఆర్ఎస్ రద్దు

ప్రజాశక్తి - కాకినాడ

'మొంథా తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో సోమవారం కలెక్టరేట్‌లో జరగాల్సిన పిజిఆర్ఎస్‌ను రద్దు చేసినట్లు కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి తెలిపారు. కావున ప్రజలు గమనించాల్సిందిగా ఆయన కోరారు.

కార్టూ'నిజం'



హాస్టల్ సిబ్బందిపై ఎస్‌సి కమిషన్ ఛైర్మన్ ఆగ్రహం

ప్రజాశక్తి - జగ్గంపేట

గురుకుల బాలికల వసతి గృహ ఉద్యోగులపై ఎస్‌సి కమిషన్ ఛైర్మన్ కెఎస్.జవహర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక గురుకుల బాలికల వసతి గృహాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటశాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం జగ్గంపేట శివారు ఉన్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని పరిశీలించారు. వసతి గృహ ఎంట్రన్స్ బోర్డులో తేదీని మార్చకపోవడాన్ని, విద్యార్థులు చదువుకునే చోట్ల లైట్లు వెలగక పోవడాన్ని ఆయన గమనించి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వంటశాలను సందర్శించి తానే స్వయంగా వండుతున్న వంటలను రుచి చూశారు. విద్యార్థులతో మాట్లాడి సౌకర్యాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ వసతి గృహాల పట్ల ఆరోగ్యం, భద్రత, పరిశుభ్రతపై చర్యలు తీసుకుంటున్నామన్నారు. వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జెవిఆర్.రమేష్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఎస్‌విఎస్.అప్పలరాజు, ఎస్‌సి సెల్ మండల అధ్యక్షులు సాంబత్తుల చంద్రశేఖర్, ఎఎంసి డైరెక్టర్ షేక్ వల్లి, పాల్గొన్నారు.



కూరను రుచి చూస్తున్న జవహార్

స్నేహితుని కుటుంబానికి పరామర్శ

అనంతరం మండలంలోని సీతానగరంకు చెందిన తన స్నేహితుడైన కోడూరి వెంకట్రావు ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలోనే ఎస్‌సి కమిషన్ ఛైర్మన్ కెఎస్.జవహర్ కుటుంబ సభ్యులు కోడూరి సత్యనారాయణ, శివరామకృష్ణలను పరామర్శించారు. వెంకట్రావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు.



పెద్దాపురంలో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

పెద్దాపురంలో పోలీసుల కార్డన్ సెర్చ్

ప్రజాశక్తి - కోటనందూరు, పెద్దాపురం

తుని పట్టణంలోని వీరవరపుపేటలో ఆదివారం తెల్లవారుజాము నుంచి 7 గంటల వరకు సిఐ ఎం.గీత రామకృష్ణ ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ప్రతి ఇంటిని, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. సరైన పత్రాలు లేని 23 ద్విచక్ర వాహనాలను, అనుమానాస్పదంగా ఉన్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు సిఐ తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్ఐలు విజయ్‌బాబు, టి.రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే పెద్దాపురం మండలం వాలు తిమ్మాపురం రోడ్డులోని టిడ్కో గృహాల్లో ఆదివారం తెల్లవారుజామున పోలీసుల కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో సిఐలు విజయశంకర్, అంకబాబు, ఎస్ఐలు మౌనిక, రఘురాం, శివనాగు పాల్గొన్నారు. మొత్తం ఐదు బృందాలుగా తనిఖీలు నిర్వహించారు. పత్రాలు సరిగా లేని 24 ద్విచక్రవాహనాలు, ఒక ఆటోను గుర్తించారు. ఈ సందర్భంగా సిఐ విజయశంకర్ మాట్లాడుతూ టిడ్కో గృహాలలో నివసిస్తున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

నేరాలు ఘోరాలు

బెదిరింపులపై ఫిర్యాదు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

కులం పేరుతో దూషిస్తూ ప్రయివేటు ఫైనాన్స్ సంస్థ రికవరీ ఏజెంట్ బెదిరింపులకు పాల్పడుతున్నాడని భీమవరపు వి.సూర్యరాజు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని రాజేలంక గ్రామానికి చెందిన సూర్యరాజు రెండేళ్ల క్రితం ఫైవ్‌స్టార్ ఫైనాన్స్‌లో రుణం తీసుకున్నాడు. వాయిదాల పద్ధతిలో సక్రమంగా చెల్లిస్తున్నానని ఆవేదన చెందాడు. అయితే ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా ఈ నెల వాయిదా గడువు ఇంకా ఉన్నప్పటికీ, రికవరీ ఏజెంట్ సుంకర స్వామి తక్షణం చెల్లించాలని తీవ్ర ఒత్తిడి చేస్తూ, కులం పేరుతో దూషించి చచ్చేంత వరకు దుర్భాష లాడుతూ భయ భ్రాంతులకు గురి చేస్తున్నాడని సూర్యరాజు ఆరోపించారు. స్వామి నుంచి తనకు తన కుటుంబానికి ప్రాణహాని ఉందని, కాల్ మనీ వేధింపులకు పాల్పడుతున్న స్వామిపై కేసు నమోదు చేసి రక్షణ కల్పించాలని సూర్య రాజు పోలీసులకు ఫిర్యాదుచేశాడు.


అన్నంపల్లి టోల్ ప్లాజా వద్ద రవాణాశాఖ అధికారుల తనిఖీలు

మూడు ట్రావెల్స్ బస్సుల సీజ్

ప్రజాశక్తి - ముమ్మిడివరం

కర్నూలు ట్రావెల్ బస్ ఘటన నేపథ్యంలో రవాణా శాఖ అధికారులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. మండలంలోని అన్నంపల్లి టోల్ ప్లాజా వద్ద శనివారం రాత్రి చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో మూడు ప్రయివేటు ట్రావెల్స్ బస్సులపై కేసులు నమోదు చేసి సీజ్ చేశామని, అలాగే నాలుగు బస్సులపై ఇతర కేసులు నమోదు చేసి రూ.20,000 వేలు అపరాధ రుసుము విధించామని జిల్లా రవాణా శాఖ అధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. సీజ్ చేసిన మూడు బస్సులలో అనధికారికంగా సీట్ల మార్పిడి చేసినట్లు గుర్తించామని, ఇది మోటారు వాహనాల చట్టం ఉల్లంఘన కింద మూడు బస్సులను సీజ్ చేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు అప్పగించామని శ్రీనివాసరావు తెలిపారు. సీజ్ చేసిన బస్సులు యానాం నుంచి హైదరాబాద్ కి నిత్యం తిరుగుతున్నాయని, ఇకపై తనిఖీలను ముమ్మరం చేస్తామని ఆయన తెలిపారు. ఈ తనిఖీల్లో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, జ్యోతి సురేష్, కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన వారి అప్పగింత

ప్రజాశక్తి - గండేపల్లి

తప్పిపోయిన ఇద్దరిని గుర్తించి ఆదివారం వారి కుటుంబ సభ్యులకు పోలీసులు అప్పగించారు. ఎస్ఐ శివనాగు తెలిపిన వివరాల ప్రకారం.. కరప మండలానికి చెందిన డి.హర్ష ఆర్థిక ఇబ్బందులతో 4 రోజుల క్రితం మురారిలోని అంతారింటికి వచ్చాడు. అక్కడ నుంచి కన్పించకుండా పోయాడు. దీంతో అతని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే మండలంలోని నీలాద్రిరావుపేటకు ఎన్.దేవి కుటుంబ కలహాలతో ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆమె కుటుంబ సభ్యులు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆయా ఫిర్యాదులపై మిస్సింగ్ కేసులు నమోదు చేసి ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఎఎస్ఆర్ జిల్లా అరకు వాలీలో హర్షను పట్టుకున్నామని, అలాగే దేవిని గొల్లప్రోలులో గుర్తించి స్టేషన్‌కు తీసుకొచ్చి వారి వారి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు. ఆయా కుటుంబాలకు చెందిన సభ్యులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

172 కిలోల గంజాయి స్వాధీనం, ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి - కొవ్వూరు

కొవ్వూరు టోల్గేట్ సమీపంలో ఆదివారం 172 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ అధికారి సిహెచ్.లావణ్య తెలిపారు. డొంకరాయి నుంచి ఆటోలో తీసుకువచ్చిన గంజాయి ప్యాకెట్లను కంటైనర్ లారీలో ఎగుమతి చేస్తుండగా పట్టుకున్నామని ఆమె తెలిపారు. లారీ డ్రైవర్, ఆటో డ్రైవర్, లారీ క్లీనర్‌ను అదుపులో తీసుకున్నట్టు ఆమె తెలిపారు. గంజాయి తరలింపునకు వినియోగించిన ఆటోతో పాటు కంటైనర్ లారీని స్వాధీనం చేసుకున్నట్లు ఆమె తెలిపారు. కొవ్వూరు సిఐ పి.సత్యనారాయణ ఎస్ఐలు రవిశంకర్ బాలాజీ, జి.సత్యనారాయణ పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - కోటనందూరు, రౌతులపూడి

తాండవ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ టి.రామకృష్ణ సూచించారు. ఆదివారం మండలంలోని అప్పలరాజుపేట, అల్లిపూడి పరిసర గ్రామాల్లో ఆయన పర్యటించారు. మొంథా తుపాన్ ప్రభావంతో పెనుగాలులు, భారీ వర్షాలకు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. లోతట్టు ప్రాంత ప్రజలు మెరక ప్రాంతాలకు తరలి వెళ్లాలని కోరారు. రౌతులపూడి రెవెన్యూ కార్యాలయంలో మొంథా తుపాన్‌పై అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నరేష్, ఎంపిడిఒ శివరామకృష్ణయ్య పాల్గొని మాట్లాడారు. విద్యుత్ సరఫరానికి అంతరాయం కలగకుండా జనరేటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

సురక్ష యాప్‌తో నకిలీ మద్యానికి అడ్డుకట్ట

జిల్లా మద్యనిషేధ మరియు అబ్కారీ అధికారి సిహెచ్.లావణ్య





ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లాలో నకిలీ మద్యం నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నామని జిల్లా మద్యనిషేధ మరియు అబ్కారీ అధికారి సిహెచ్.లావణ్య స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా నకిలీ మద్యం కలకలం మొదలైన విషయం విధితమే. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సురక్ష యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. మరోవైపు జిల్లా ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు నిరంతరం నిఘా పెంచారు. ఈ నేపథ్యంలో జిల్లాలో నకిలీ మద్యం కార్యకలాపాల నియంత్రణ చేపట్టిన చర్యలపై ప్రజాశక్తి ముఖాముఖిలో లావణ్య వివరించారు.

అందుబాటులో ఎపి సురక్ష యాప్ ఉందా?

నకిలీ, కల్తీ మద్యపాన పదార్థాల నియంత్రణకు అబ్కారీ శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'సురక్షా - ఏపీ ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్' అనే మొబైల్ యాప్‌ను రూపొందించింది. ఈ యాప్ ద్వారా ప్రజలు తాము కొనుగోలు చేసిన మద్యం సీసాపై ఉన్న క్యుఆర్ కోడ్‌ను స్కాన్ చేసి, ఆ మద్యం ప్రభుత్వ అనుమతితో విక్రయించబడినదా లేదా అనే విషయాన్ని సులభంగా తెలుసుకోవచ్చు. సీసాపై ఉన్న క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేయగానే ఆ బాటిల్ యొక్క నిజమైన వివరాలు, బ్రాండ్ పేరు, లైసెన్స్ వివరాలు, తయారీ స్థలం మొదలైనవి ఫోన్ స్క్రీన్‌పై కనిపిస్తాయి. నకిలీ లేదా చట్టవిరుద్ధమైన మద్యం అయితే, వెంటనే హెచ్చరిక సందేశం వస్తుంది.

యాప్ డౌన్‌లోడ్ విధానం ఎలా..?

ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్ల ప్లే స్టోర్‌లో అందుబాటులో ఉంటుంది. సురక్ష -ఎపి ఎక్సయిజ్ డిపార్ట్‌మెంట్ అని పేరు ఉంటుంది. ఇన్స్టాల్ చేసిన తర్వాత రెండు ఎంపికలు కనిపిస్తాయి. ఒకటి - వినియోగదారుల కోసం, ఇంకొకటి - మద్యం షాపు నిర్వాహకుల కోసం. ప్రజల సురక్షిత మద్యం వినియోగాన్ని నిర్ధారించడానికి 'ఎక్సైజ్ శాఖ సురక్షా' యాప్‌ను ఉపయోగించాలి. యాప్ ఓపెన్ చేసిన తర్వాత బాటిల్ పై ఉన్న క్యూఆర్‌కోడ్ స్కాన్ చేయాలి. నకిలీ మద్యం అయితే 'డిటెయిల్స్ నాట్ ఫౌండ్' అని కనిపిస్తుంది. యాప్‌లోని సమాచారం జిల్లా కేంద్రంలోని అధికారుల మరియు రాష్ట్ర స్థాయి అధికారుల డేటాబేస్‌కు పంపబడుతుంది.

జిల్లాలో నకిలీ మద్యం కార్యకలాపాలు..?

జిల్లాలోని 138 మద్యం దుకాణాలు, 20 బార్లలో నాణ్యత తనిఖీలు జరుగుతున్నాయి. ప్రజారోగ్యం, సామాజిక శాంతి, భద్రత పరిరక్షణను అత్యంత ప్రాధాన్యంగా తీసుకొని, అక్రమ మద్యం తయారీ, రవాణా, విక్రయాలు, నాటుసారా, కల్తీ కల్లు, అనుమతిలేని మద్యం విక్రయ కేంద్రాలపై నిరంతర దాడులు నిర్వహిస్తూ, వాటిలో పాల్పడే వ్యక్తులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటున్నాము. జిల్లాలోని 7 ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్లు, ఇఎస్ టాస్క్ ఫోర్స్, ఎన్‌ఫోర్‌మెంట్ బృందాలు సమన్వయంతో అన్ని మద్యం షాపులు, బార్లు, పర్మిట్ రూములు, ఇండస్ట్రియల్ ఏరియాలు, పాడుబడ్డ భవనాలు, మారుమూల ప్రాంతాలను క్రమం తప్పకుండా తనిఖీ చేయడం జరుగుతోంది. ఇప్పటి వరకు జిల్లాలో నకిలీ మద్యం తయారీ లేదా విక్రయాల కార్యకలాపాలు లేవు.

జిల్లాలో మద్యం శాంపిల్స్‌ను సేకరిస్తున్నారా..?

ఈ నెల 16వ తేదీ నుంచి ఇప్పటివరకు 574 శాంపిళు సేకరించి, రీజనల్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ల్యాబ్‌కు పంపగా, ఎక్కడా కల్తీ మద్యం ఆనవాళ్లు లభించలేదు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆధ్వర్యంలో విడుదలైన 'ఎపి ఎక్సైజు సురక్ష' యాప్ ద్వారా మద్యం కొనుగోలు చేసే వారు బాటిల్ మూతపై ఉన్న సీల్‌ను స్కాన్ చేసి, అది నిజమైనదా లేక నకిలీదా తేల్చుకోవచ్చు. నకిలీదని అనిపించిన పక్షంలో వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 14405కి సమాచారం అందించగలరనీ విజ్ఞప్తి చేస్తున్నాము.

నాటు సారా నియంత్రణపై చర్యలు..?

నాటుసారాయి తయారీ, అక్రమ విక్రయాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నాము. నాటుసారాను అరికట్టడంలో ప్రజల సహకారం అత్యవసరం. అనుమానాస్పద మద్యం తయారీ లేదా రవాణా గురించిన సమాచారం ఉన్నపక్షంలో సమీప ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌కి లేదా టోల్ ఫ్రీ నంబర్ 14405 కి తెలియ జేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాము. అటువంటి సమాచారం ఇచ్చిన వారి వివరాలు విషయంలో గోప్యత పాటించడం జరుగుతుంది.

నకిలీ మద్యం నియంత్రణపై నిఘా..?

జిల్లాలోని అన్ని తెరిచి ఉన్న గోడౌన్లు, నిల్వ కేంద్రాలు మరియు అనుమానాస్పద ప్రాంగణాలను క్రమం తప్పకుండా తనిఖీ చేస్తున్నాము. నకిలీ మద్యం సరఫరా లేదా పంపిణీ జరగకుండా నిరోధించేందుకు నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేశాము. అలాగే పార్శిల్ కార్యాలయాలు, ప్రయివేట్ రవాణా నిర్వాహకులు, ఆర్‌టిసి పార్శిల్ సేవలు, రైల్వే పార్శిల్ కార్యాలయాలు మరియు బస్ డిపోలు వారానికోసారి తనిఖీ చేయబడుతున్నాయి. ఈ నిరంతర నిఘా చర్యల ద్వారా తూర్పు గోదావరి జిల్లాలో అక్రమ మద్యం తరలింపులు ముందస్తుగా గుర్తించి, వాటిని వెంటనే అడ్డుకునేలా చర్యలు కొనసాగుతున్నాయి.


సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

టైలర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - గొల్లప్రోలు

టైలర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని టైలర్స్ ప్రాథమిక సహకార సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బత్తుల కొండలరావు, కోరాకుల పాపారావు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక స్వామి వివేకానంద జ్ఞాన మందిరంలో సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్ఆర్ పాలనలో ఇచ్చిన జిఒ నెంబర్ 86 ద్వారా టైలర్లు సొసైటీలుగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, కానీ చేనేత కార్మికులకు వర్తించే 200 యూనిట్ల ఉచిత కరెంటు, 50 ఏళ్లకే పింఛన్ వర్తించడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో వినుకొండ రాజు, సాధనాల రాము, దాసన్ కొండబాబు, టి.త్రిమూర్తులు, ఆదిమల్ల కల్యాణం, నీలం నాగేశ్వరరావు, కాకినాడ రాజు, గుండారపు సుబ్బారావు, పొట్లూరి సత్యనారాయణ పాల్గొన్నారు.


కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ చినరాజప్ప


ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగస్వామ్యం అవసరం

ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను పార్టీ శ్రేణులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప పిలుపునిచ్చారు. ఆదివారం ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో ఆయన టిడిపి శ్రేణులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో సచివాలయ సిబ్బందితోపాటు, పార్టీ శ్రేనులు పాల్గొనాలని సూచించారు. ప్రభుత్వ పథకాల అమలులో టిడిపి శ్రేణులు కీలక పాత్ర పోషించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబురాజు, టిడిపి యువ నాయకుడు నిమ్మకాయల రంగనాగ్, ఎఎంసి ఛైర్మన్ నూనె మంగలక్ష్మి, ఎఎంసి డైరెక్టర్లు జలధాని సుబ్రహ్మణ్యం, రేలంగి వెంకట్రావు, సామర్లకోట రూరల్ మండల టిడిపి అధ్యక్షుడు ముసిరెడ్డి శ్రీరాములు, వెంకటరమణ పాల్గొన్నారు.

క్రీడాకారులకు సత్కారం

ప్రజాశక్తి - తాళ్లరేవు


క్రీడాకారులను సత్కరిస్తున్న జనార్ధనరావు

మండలంలోని కోరంగి పంచాయతీ పాతకోరంగి గ్రామానికి చెందిన రెజ్లింగ్ క్రీడాకారిణి అరుబరుకుల అర్చన, అథ్లెటిక్స్ క్రీడాకారుడు రొక్కం ఎర్రాబాబులను మండల దళిత యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆదివారం ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా అర్చన తండ్రి రామచంద్రమూర్తి, ఎర్రాబాబు తండ్రి రొక్కం లోవరాజులను సంఘ నాయకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పి మాజీ ఛైర్మన్ దున్న జనార్దనరావు, పోలేకుర్రు సర్పంచ్ వెంటపల్లి నూకరాజు, వెంటపల్లి వెంకటరమణ, ఎండియూడబ్ల్యుఎ అధ్యక్ష, కార్యదర్శులు కన్నీడి వెంకటరమణ, కుసుమ శ్రీనివాస్, నాయకులు జక్కల ప్రసాద్‌బాబు, కమిడి ఈశ్వరి బాయి, పాలిక శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

డివిజన్‌లో 134 మిల్లీమీటర్ల వర్షం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం డివిజన్ పరిధిలో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు 134 మిల్లి మీటర్ల వర్షపాతం నమోదయింది. కోటనందూరులో 0.6, రౌతులపూడిలో 1.4, శంఖవరంలో 68, కిర్లంపూడిలో 33.2, ప్రత్తిపాడులో 30.8, మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదయింది.

యానాం వార్తలు


పురస్కారాలు అందిస్తున్న కృష్ణారావు

సాహిత్య, సాంస్కృతిక రంగాలకు ప్రోత్సాహం

ప్రజాశక్తి - యానాం

సాహిత్య, కళా సాంస్కృతిక రంగాలకు ప్రోత్సాహించాల్సిన అవసరం ఉందని పుదుచ్చేరి ప్రభుత్వం ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అన్నారు. ఆదివారం స్థానిక అంబేద్కర్ నగర్ కల్యాణ మండపంలో కవిసంధ్య సాంస్కృతిక సంస్థ దశాబ్ది ఉత్సవం, శిఖామణి సాహిత్య పురస్కారాల ప్రదానం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కవులు, రచయితలు సమాజాన్ని చైతన్యవంతం చేస్తారని అన్నారు. అయితే వారి రచనలు పుస్తక రూపంలోకి తీసుకురావడానికి కొంత మంది ఇబ్బంది పడతారని, అటువంటి కవులకు ఆర్థికంగా ప్రోత్సాహం అందించాలన్నారు. వచ్చే ఏడాది నుంచి ముగ్గురు స్థానిక కవులకు, అలాగే ఇతర జిల్లాలకు చెందిన కవుల పుస్తకాల ముద్రణకు ఆర్థిక సాయం, అలాగే కవిసంధ్య కార్యక్రమాలకు తోడ్పాటును అందించనున్నట్టు తెలిపారు. పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ సమాజ చైతన్యానికి సాహిత్యం తోడ్పడుతుందని, కవిత్వం మనిషిని కదిలిస్తుందని తెలిపారు. సభకు అధ్యక్షత వహించి శిఖామణి, కవులు దాట్ల దేవదానంరాజు, డాక్టర్ వరగు భాస్కరరెడ్డి, డానియల్ నెజర్స్, మధునాపంతుల మాట్లాడారు.

శిఖామణి సాహితీ పురస్కారాల ప్రదానం

సాహిత్యంలో జీవన సాఫల్య కృషికి ప్రతీఏటా ఇచ్చే శిఖామణి సాహితీ పురస్కారంను మూర్తీదేవి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పద్మశ్రీ, ఆచార్య కొలకలూరి ఇనాక్, అలాగే కవిత్వంలో యువ కవులకు ఇచ్చే శిఖామణి యువ పురస్కారంను అవధులు మణిబాబులకు ప్రదానం చేశారు. అలాగే ఎస్ఆర్.పృథ్వీ, పిఆర్ఎల్.స్వామి, బివిఎస్. మంగేష్, డాక్టర్ వరుగు భాస్కరరెడ్డి, డాక్టర్ కోయి కోటేశ్వరరావు, పుప్పాల సూర్యకుమారి, పొనుగుమట్ల అశోక్‌కుమార్, పెనుమాక రత్నాకర్, మిరప మహేష్‌లకు కవిసంధ్య ప్రతిభా పురష్కారాలతో సత్కరించారు.



ముందుస్తు రక్షణ చర్యలు

ప్రజాశక్తి - యానాం

మొంథా తుఫాన్‌ను దృష్టిలో పెట్టుకుని ముందస్తు రక్షణ చర్యలు చేపట్టినట్లు ఆర్ఎఒ అంకిత్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పిడబ్ల్యుడి, పోలీస్, రెవెన్యూ, విద్యుత్, వ్యవసాయ తదితర శాఖలకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. యానాంకు ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందం వస్తున్నట్లు తెలిపారు. తుపాను బాధితులను తరలించేందుకు వీలుగా 16 సైక్లోన్ రిలీఫ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ నెల 27, 28, 29 తేదీల్లో విద్యా సంస్థలకు సెలవు ప్రకటించామని, మత్స్యకారులు ఎవరూ వేటకు వెళ్లకుండా నిషేధం విధించినట్లు తెలిపారు. పర్యాటక కార్యక్రమాలను నిలుపుదల చేసినట్లు తెలిపారు.

ముగిసిన స్టేట్ స్కూల్ గేమ్స్ పోటీలు

ప్రజాశక్తి - యానాం

స్థానిక డాక్టర్ వైఎస్ఆర్ ఇంటర్నేషనల్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన స్టేట్ స్కూల్ గేమ్స్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆదివారం బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పాల్గొని మాట్లాడారు. విద్యతో పాటు క్రీడల పట్ల విద్యార్థులు ఆశక్తిని పెంచుకోవాలని అన్నారు. యానాంలో ఉన్న క్రీడాసౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం విజేతలైన పుదుచ్చేరి, మాహే, కారైకల్, యానాం క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. క్రీడలను పిఇటీలు కొప్పనాతి భాస్కర్, పాలికి స్వామి, చింతా వెంకన్న, రమేష్, ఐవికె.మోహన్, పాము సత్యనారాయణ, జల్లి చంద్రశేఖర్, వడ్డి వరప్రసాద్ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎఒ అంకిత్‌కుమార్, విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్‌ప్రవీణ్, రవికుమార్ పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - యానాం

మొంథా తుపాన్ పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ సూచించారు. ఆదివారం ఆర్ఎఒ అంకిత్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజలెవరు భయందోళనకు గురి కావద్దని, ముందస్తుగా రాబోయే విపత్తుపై చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. పునరావస కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. లోతట్టు ప్రాంత ప్రజలు ముందుగానే సురక్షితమైన ప్రాంతానికి తరలి వెళ్లాలన్నారు. బయటికి ఎవరు రావద్దని సూచించారు. మత్స్యకారులు ఎవరు వేటకు వెళ్లొద్దన్నారు.

మాదకద్రవ్యాల నియంత్రణపై అవగాహన

ప్రజాశక్తి - కాకినాడ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విద్యార్థులు

ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నియంత్రణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో 'ఈగల్' బృందం మాదక ద్రవ్యాల నియంత్రణ, న్యాయపరమైన శిక్షలపై అవగాహన కల్పించింది. ఈ సందర్భంగా ఈగల్ బృందం ఇన్‌ఛార్జ్ ఎస్ఐ ఆంజనేయులు మాట్లాడుతూ విద్యార్థులు వ్యసనాలకు బానిస కాకూడదని, దేశ ప్రగతికి నాంది పలకాలని అన్నారు. సాధారణ చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థి యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. బృందం సభ్యుడు ధర్మతేజ మత్తు పదార్థాల కేసులు, శిక్షలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టూ టౌన్ ఎఎస్ఐ నరసింహారావు మాట్లాడుతూ యువతే లక్ష్యంగా మత్తు పదార్థాల వాడకం జరుగుతుందని, విద్యార్థుల అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి టి.తేజేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎన్ఎస్ఎస్, ఈగల్ టీమ్ విభాగాన్ని ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ ఎన్.సుగుణా రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ నాయుడు అభినందించారు.

ఏలేరు పరీవాహక ప్రాంతాల్లో అధికారుల పర్యటన

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని ఏలేరు పరివాహక ప్రాంతాల్లో అధికారులు ఆదివారం పర్యటించారు. మొంథా తుపాన్ ప్రభావానికి ఏలేరు జలాసయంలోకి అధిక శాతం వరద జలాలు చేరే అవకాశం ఉన్నందున ఇరిగేషన్ అధికారులు అధికశాతం జలాలను క్రిందికి వదిలిపెట్టిన విషయం తెలిసిందే. సోమవారం నుంచి భారీ వర్షాలు ఉండే అవకాశం ఉన్నందున కాండ్రకోట గ్రామంలో ఏలేరు రెగ్యులేటర్ వద్ద ఎలాంటి ప్రమాదం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు తహశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మి చెప్పారు. కాండ్రకోట గ్రామంలో ఏలేరు రెగ్యులేటర్(దబ్బ కాలువ)ను పరిశీలించారు. ఏలేరు రిజర్వాయర్ నుంచి దిగువకు అధిక జలాలను విడుదల చేసే సమయంలో లోతట్టు ప్రాంతాల్లోకి వరద నీరు వచ్చే అవకాశం ఉందని, రైతులు పశువుల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తహశీల్దార్ వెంకటలక్ష్మి సూచించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఎఇ నిమ్మకాయల శ్రీనివాసరావు, రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

డిసిఎం ఇలాకాలో రైతులకు తీవ్ర అన్యాయం

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి


నినాదాలు చేస్తున్న సిపిఐ నాయకులు, కార్యకర్తలు

డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యులు తాటిపాక మధు అన్నారు. ఆదివారం మండలంలోని కొమరిగిరి గ్రామంలో సిపిఐ బృందం పర్యటించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని సర్వేనెంబర్ 121, 122లో ఉన్న 20 ఎకరాల జురాయితీ భూమిని 1949 నుంచి బలహీనవర్గాల కు చెందిన రైతులు సాగు చేసుకుంటున్నారని అన్నారు. అయితే దేవస్థానం అధికారులు మూడు రోజుల క్రితం ఆ భూమి దేవస్థానంకు చెందినదం టూ బోర్డులు పెట్టడం దారుణమన్నారు. సుమారు 90 ఏళ్లుగా పొజిషన్లో ఉండి లింక్ డాక్యుమెంట్లు, పాస్ పుస్తకాలు, పేర్‌డంగల్, వన్ బి రికార్డులు కలిగి ఉన్న రైతుల భూమిని దేవస్థానం అధికారులు స్వాధీనం చేసుకోవడం దారుణమన్నారు. 2012లో అప్పటి కలెక్టర్, ఆర్‌డిఒ, తహశీల్దార్‌లు ఆ భూమి దేవస్థానం కాదని నిర్ధారించినా ప్రస్తుతం అధికార పార్టీకి చెందిన నాయకుల అండదండలతో ఈ భూమిని ఆక్రమించుకున్నారని అన్నారు. నవంబర్ 1న గొర్స ప్రాంతంలో వేలంపేట పెట్టారని, వేలంపాటను అడ్డుకోవాలని కోరారు. త్వరలోనే పిఠాపురంలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసి భవిష్యత్తు కార్యచరణ ప్రకటిస్తామని మధు ప్రకటించారు. ఈ పర్యటనలో సిపిఐ జిల్లా కార్యదర్శి కె.బోడకొండ, సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్, పిఠాపురం నియోజకవర్గ కార్యదర్శి శాఖ రామకృష్ణ, ఎపి రైతు సంఘం జిల్లా కన్వీనర్ నక్క శ్రీనివాసరావు, రైతులు సత్యనారాయణ సుబ్బారావు, కృష్ణ, బాపనయ్య, దానయ్య పాల్గొన్నారు

పేరుకుపోతున్న చెత్త

ప్రజాశక్తి - రౌతులపూడి


స్కూల్‌కు ఎదురుగా పేరుకుపోయిన చెత్త

మండలంలోని ఎ.మల్ల వరం సాంఘిక సంక్షేమ పాఠశాల వద్ద చెత్త పేరుకుపోతుంది. దీంతో ఆ ప్రాంతమంతా దుర్వాసన వెదజలుతోంది. పాఠశాల విద్యార్థులు దుర్వాసనకు ఇబ్బందులు పడుతున్నారు. గత వారం రోజులుగా పడుతున్న వర్షంతో ఎక్కడ చెత్త అక్కడే అన్నట్లుగా పరిస్థితి మారిపోయింది. పారిశుధ్య నిర్వాహణ లోపించడంతో దోమలు, ఈగలు పెరిగిపోతున్నాయి. విద్యార్థులు అనారోగ్యాల భారిన పడే ప్రమాదం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి పేరుకుపోయిన చెత్తను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

పునరావాస కేంద్రాల తనిఖీ

ప్రజాశక్తి - కాకినాడ

తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో నగరంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను అధికారులు ఆదివారం సాయంత్రం సందర్శించారు. నగరపాలక సంస్థ కమిషనర్ కెటి. సుధాకర్, అర్బన్ తహశీల్దార్ జితేందర్, డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వీచరణ్, తదితరులు నగరంలోని జగన్నాధపురం ప్రాంతంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక పునరావాస కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో ఉన్న సిబ్బందికి తగిన సూచనలు జారీ చేసి, తుఫాన్ పరిస్థితుల్లో అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు.